నాణ్యతకు తిలోదకాలు

- అక్కరకు రాని రైల్వే అండర్ పాస్
- నిర్మించిన మూడేళ్లకే లీకేజీలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు
- రైల్వేశాఖలో సమన్వయ లోపం

తుని: పట్టణంలో రైల్వేశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన రైల్వే అండర్ పాస్ పరిస్థితి మూడేళ్ల ముచ్చటగా మారింది. అండర్ పాస్ నిర్మించిన మూడేళ్లకే లీకేజీలు ఏర్పడ్డాయి. కొద్దిపాటి వర్షాలకే అక్కరకు రాకుండా పోయింది. దీని నిర్మాణానికి రూ.5.50 కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించారు. అండర్ పాస్ నిర్మాణ బాధ్యతలు బడా కాంట్రాక్టర్‌కు అప్పగించారు. తునితో పాటు కాకినాడ, అనకాపల్లి జిల్లాల పరిధిలో పలు ప్రాజెక్టుల పనులను ఆయన దక్కించుకున్నారు. రైల్వేశాఖలో ఉన్న లోసుగుల కారణంగా బడా కాంట్రాక్టర్లు థర్డ్ పార్టీకి అప్పగించి పనులు పూర్తి చేసి బిల్లు తీసుకుని చేతులు దులుపుకున్నారు. రెండేళ్ల పాటు వర్షాలు లేక పోవడంతో తుని అండర్ పాస్ నిర్మాణంలో లోపాలు బయటపడలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు బండారం బయట పడింది. ఒక్కసారిగా అండర్ పాస్‌లోకి నీరు చేరడంతో వాహనాల రాక పోకలు నిలిచిపోయాయి. వాహన చోదుకులు అండర్ పాస్‌లో ప్రయాణం చేయడం కష్టంగా మారింది. ప్రజలు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

అండర్ పాస్ నిర్మాణానికి రూ.5.50 కోట్లు

తుని పట్టణంతో పాటు రూరల్ మండలం, రౌతులపూడి మండలాలకు చెందిన 100 గ్రామాలకు తాళ్లూరు రైల్వే గేటు ప్రధాన మార్గం. రెండు రైల్వే లైన్లు ఉండడంతో రైలు వస్తే చాలు అరగంట సమయం గేటు మూసి ఉండేది. ఎంతో మంది అత్యవసర పనులు, వైద్య సేవలు కోసం వచ్చి ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వచ్చేది. అప్పటి ప్రభుత్వాలు ప్రజల సమస్యను పట్టించుకోలేదు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటి రోడ్లు, రవాణాశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీత జోక్యం చేసుకుని రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు తీసుకువచ్చారు. కేంద్రం రూ.5.50 కోట్లతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మ్యాచింగ్ గ్రాంటు మంజూరు చేశారు. రెండేళ్ల పాటు నిర్మాణ పనులు జరిగాయి. 2022లో రైల్వే అండర్ పాసును ప్రారంభించారు. అప్పటినుంచి ప్రజలకు రవాణా సౌకర్యం సులభ తరమైంది.



ఇటీవల కురిసిన వర్షాలకు తాళ్లూరు రైల్వే అండర్ పాస్‌లోకి చేరిన నీరు



నీటిలో రాకపోకలకు అవస్థలు

నిర్వహణ అధ్వానం

రైల్వే అండర్ పాస్ నిర్వహణను తొలుత ప్రైవేటు సంస్థకు అప్పగించారు. రెండేళ్ల పాటు నిర్వహణ చేస్తారని అధికారులు చెప్పారు. వర్షం నీరు అండర్ పాస్‌లోకి చేరితే విద్యుత్ పంపు సాయంతో బయటకు తోడి పంపించాల్సి ఉంది. రెండేళ్ల పాటు ఏ విధమైన వర్షాలు లేవు. ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా నీరు అండర్ పాస్‌లోకి చేరింది. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నిర్మాణానికి అనుమతి ఇచ్చిన అధికారులు వర్షం నీరు పోవడానికి తగిన మార్గం చూపలేదు. దీంతో పాటు అండర్ పాస్ నుంచి గెడ్లబీడు వరకూ కాలువ నిర్మించాల్సి ఉండగా అది కూడా చేయలేదు. కాంట్రాక్టర్‌తో నాయకులు చేతులు కలిపి అందిన కాడికి పంచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు

గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం నిర్వహణ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీరు అండర్ పాస్‌లోకి చేరింది. నీరు పంపింగ్ చేయడానికి ఏర్పాటు చేసిన మోటారు పని చేయలేదు. నీరు భారీగా నిలిచిపోవడంతో ప్రజలకు ఇబ్బంది కలిగింది. నిలిచిపోయిన నీటిని ఆయిల్ ఇంజన్ల ద్వారా బయటకు పంపుతున్నాం. వాహనాల రాక పోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నాం.

– సుబ్రహ్మణ్యేశ్వరరావు, రైల్వే ఇంజినీరింగ్ అధికారి, తుని

వాహనాలు పాడైపోతున్నాయి

రైల్వేట్రాక్ ఆవతల ఉన్న 100 గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అండర్ పాస్‌లో నీరు చేరడంతో వాహనాల రాక పోకలకు అంతరాయం కలిగింది. తుని పట్టణంలోకి రావాలంటే 3 కిలోమీటర్లు చుట్టు తిరిగి రావాల్సి వస్తోంది. అండర్ పాస్ నిర్మించినా వర్షం నీరు పోవడానికి ఏర్పాట్లు చేయలేదు. తుని పట్టణానికి పనులు కోసం మోటారు సైకిళ్లు పాడైపోతున్నాయి. ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చించినా ప్రజలకు అధికారుల నిర్లక్ష్యం వలన వర్షం నీటి సమస్యకు పరిష్కారం లభించలేదు.

– కె.అప్పారావు, రైతు, తుని మండలం.

అడబిడ్డకు రూ.1,500 ఎప్పుడిస్తారు ?

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు నాగమణి



కిర్లంపూడిలో ముద్రగడ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిసిన మహిళా నాయకులు

కిర్లంపూడి: ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలో భాగంగా ఆడబిడ్డకు రూ.1500 ఎప్పుడు ఇస్తారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్ములమడక నాగమణి నిలదీశారు. కిర్లంపూడిలోని మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు ముద్రగడ నివాసంలో శుక్రవారం ముద్రగడను ఆమె కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ మాయమాటలు చెప్పి అధికారంలోకి రావడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ రాయితీతో రుణాలు ఇస్తామన్న హామీ ఎమైందని నిలదీశారు. చంద్రబాబు మహిళలకు చేసిన మోసాన్ని ప్రజల్లోకి తీసుకువెళతామని తెలిపారు. పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి, జెడ్పీటీసీ బెహరా రాజారాజేశ్వరి, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకమారి, మాకినీడు శేషు కుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దసరా ఉత్సవాలకు శ్రీకారం



ఏలేశ్వరంలో పందిరి రాట వేస్తున్న మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు

ఏలేశ్వరం: శ్రీదేవి నవరాత్ర వేడుకలకు పట్టణంలో శుక్రవారం పందిరి రాట వేసి శ్రీకారం చుట్టారు. స్థానిక తోటవీధిలో అలమండ పెద చలమయ్య, శైలజ దంపతుల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పందిరి రాట వేశారు. కాగా వచ్చే నెల 2న విజయదశమి కావడంతో ఈ నెల 22 నుంచి నవరాత్రుల ప్రారంభం కానున్నాయి. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కోరాడ సత్యనారాయణ, సామంతుల గోపాలకృష్ణ, కోరాడ శివరామకృష్ణప్రసాద్, సామంతుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామికి శుక్రవారం తిరునక్షత్ర పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం శ్రవణం సందర్భంగా అర్చకులు 108 కలశాల పంచామృతాలకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లు, పరివార దేవతలకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

తంటికొండ ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు




దేవదాయ శాఖ అధికారులతో ఆలయ అభివృద్ధిపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గోకవరం: మండలంలోని తంటికొండ వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. శుక్రవారం ఆయన దేవదాయ శాఖ అధికారులతో కలిసి తంటికొండ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో భాగంగా ఆలయ పునఃనిర్మాణం, ముఖ మండపం, ప్రాకార మండపం, రాజగోపురం, ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయానికి ఈశాన్యం వైపు కోనేరు, కాలినడకన వచ్చే భక్తులకు కోనేరు వద్ద నుంచే కొండకు నడిచి వచ్చే విధంగా ప్రత్యేక మార్గం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న అన్నదాన భవనాన్ని మరొకచోటకు మార్చే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్టు తెలిపారు. 2027 పుష్కరాల నాటికి భక్తులకు కానుకగా నూతన ఆలయాన్ని అందజేస్తామన్నారు. ఆయన వెంట దేవస్థానం చైర్మన్ బదిరెడ్డి అచ్చన్న దొర, తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ

ప్రత్తిపాడు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 15న నిర్వహించే చలో విజయవాడ (రాష్ట్ర లేబర్ కమిషనరేట్ ముట్టడి) కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల శాఖ డిమాండ్ చేసింది. ప్రత్తిపాడులో శుక్రవారం సాయంత్రం 'చలో విజయవాడ' పోస్టర్‌ను సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నెట్ల శ్రీను మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరణ చేయకపోవడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రాల వలే ఏపీలో కూడా సంక్షేమ బోర్డు పథకాలు భవన కార్మికులకు తక్షణమే అమలు చేయాలన్నారు. సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు శీరం సత్తిబాబు, ఎ.నిరంజన్, రాజా, ధరణాలకో వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతోపాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట

- వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు మురళీకృష్ణంరాజు



సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: వృద్ధుడు అని కూడా చూడకుండా తన తండ్రిపై అక్రమ కేసు పెట్టడం కూటమి ప్రభుత్వ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట అని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. మండలంలోని ధర్మవరంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. తొలుత అదే గ్రామంలో టీడీపీ నేతలు ప్రెస్ మీట్ పెట్టి మురళీకృష్ణంరాజును వ్యక్తిగతంగా దూషించారు. దీంతో పాత్రికేయుల సమావేశంలో తనను దూషించిన వ్యక్తిపై మురళీకృష్ణంరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలకు సంబంధంలేని తన తండ్రిపై సభ్య సమాజం సిగ్గుపడే తరహాలో అక్రమ కేసు పెట్టారని మండి పడ్డారు. నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందన్నారు. తాను ఎటువంటి అవినీతి చేయలేదని రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో ప్రమాణం చేస్తానన్నారు. మీరు అవినీతికి పాల్పడటం లేదని ప్రమాణం చేయగలరా ? అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు, పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధికార ప్రతినిధి మాకినీడి శేషుకుమారి, జెడ్పీటీసీ, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు బెహరా దొరబాబు, అమరాది కాశీ, ఇసుకపాటి సత్తిబాబు, మదినే నూకరాజు, ఉమ్మిడి అప్పన్న, కట్టమూరి కొండబాబు, దిడ్డి ఏసుబాబు, పెదపాటి సుజాత, బొట్టా అనంతలక్ష్మి తదితరులు తరలివచ్చి మురళీకృష్ణంరాజుకు సంఘీభావం తెలిపారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

ఏలేశ్వరం: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో శుక్రవారం ముస్లింలు మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కెట్ రోడ్‌లోని జామియా మసీదులో అంజుమాన్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ప్రవక్త బోధించిన ప్రపంచ శాంతి, విశ్వమానవ సౌభ్రాతత్వం నేటి తరానికి అనుసరణీయమన్నారు. అనంతరం పట్టణంలో మార్కెట్ రోడ్డు, బాలాజీ చౌక్, నర్సీపట్నం రోడ్డు, మెయిన్ రోడ్డు మీదుగా ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి బదిరెడ్డి గోవిందు తన ఇంటి వద్ద ర్యాలీకి స్వాగతం పలికి శీతలపానీయాలు, ఫలహారం అందజేశారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



తామరాడ గణపతి నిమజ్జనంలో డ్రైవర్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తున్న పోలీసులు

కిర్లంపూడి: ఆధ్యాత్మికత చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. కిర్లంపూడిలోని ఏనుగువీధి, కొండయ్యపేట, కొత్తపేట గ్రామాల్లోని గణపతి విగ్రహాలను శుక్రవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద నిర్వహించిన అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. అనంతరం భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, ఆయా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణపతి నిమజ్జనాలు

కిర్లంపూడి: ప్రశాంత వాతావరణంలో గణపతి నిమజ్జనాలు చేయాలని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. స్థానిక ఎస్సై జి.సతీష్ కలిసి శుక్రవారం మండలంలోని గోనేడ, తామరాడ, సోమవరం గ్రామాల్లోని వినాయక నిమజ్జనాలను ఆయన పరిశీలించారు. ఊరేగింపు వాహనాలు నడుపుతున్న డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గణపతి హోమం

గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక కుమ్మరి వీధిలో వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో గూనూరి సందీప్, నక్క వీరబాబు, గాబు శివ, తిల్లపూడి బాబు, సేనాపతి వాసు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు

ఏలేశ్వరం: గణపతి నవరాత్రుల ముగింపులో భాగంగా పట్టణంలో శుక్రవారం అన్నసమారాధనలు నిర్వహించారు. స్థానిక పాత అడ్డతీగల రోడ్డులోని వినాయకుని ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 3 వేల మందికి అన్నదానం చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మజ్జి సూరిబాబు, గూడవిల్లి అర్జునరావు, యామన శ్రీను, కిలారి శ్రీను, ఎస్‌కే బడాబాబు, గూడవిల్లి గోవిందరావు, పేకేటి శివ, రేలంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు భారీ సంఖ్యలో నిమజ్జనాలు

గణపతి నవరాత్రులు ముగియడంతో శనివారం స్వామివారి విగ్రహాలను భారీగా నిమజ్జనం చేయనున్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటికే సగానికి పైగా విగ్రహాలను నిమజ్జనం చేశారు. సుమారు మరో 25 విగ్రహాలను నిమజ్జనం చేయాల్సి ఉంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక ఏలేరు నది వద్ద నగర పంచాయతీ సిబ్బంది నిమజ్జన ఏర్పాట్లు చేశారు.

ప్రత్తిపాడు: స్థానిక తోట వీధి గణేష్ నగర్‌లోని గణపతి మండపం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ వెనుక శ్రీతంత్ర గణపతి ఆలయంలో 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారికి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. స్వామివారికి లక్ష్మీగణపతి, మహాలక్ష్మి, నక్షత్ర, మహాసౌర, నవగ్రహ, రుద్ర, సుబ్రహ్మణ్య, ఆయుషూక్త, వాస్తు, మృత్యుంజయ తదితర హోమాలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు.

తొండంగి: గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం పలు గ్రామాల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనాలు కొనసాగాయి. ఒంటిమామిడి, తొండంగి, రావికంపాడు, ఎ.కొత్తపల్లి, శృంగవృక్షం తదితర గ్రామాల్లోని గణేశ్ విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై ఉంచి ఊరేగించారు. అనంతరం సముద్రతీరంలో నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా గురుపూజోత్సవం

- ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం
- గురువులకు సత్కారం

ఏలేశ్వరం: మాజీ రాష్ట్రపతి, ఉత్తమ గురువు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నియోజకవర్గంలో శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పెన్షనర్స్ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు ఉడత రామచంద్రరావు అధ్యక్షతన గురుపూజోత్సవం నిర్వహించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు ఉద్దగిరి సోమరాజు, ఇబ్రహీంఖాన్, పి.జోగిరాజు, ఏబీవీ ప్రసాద్‌లను సన్మానించారు. సమాజంలో గురువుల ప్రాధాన్యతను, గురువు గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వసంత ప్రసాదరావు, సత్యగాంధీ, తిరుపతిరావు, అస్మాండ్, జాన్ విల్సన్ బాబు, మజ్జి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: విద్యాబుద్ధులు నేర్పిన గురువు రుణం ఎప్పటికీ తీర్చుకోలేమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం కిర్లంపూడిలోని మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం నివాసంలో విశ్రాంత ఉపాధ్యాయుడు సూరత్ వీరవెంకట సత్యనారాయణను గిరిబాబు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త గణేశుల రాంబాబు, గౌతు స్వామి, చల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని పాలూరి స్వప్నను సత్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి అభినందనలు

గండేపల్లి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన వాసంశెట్టి త్రివేణికి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు అభినందనలు తెలిపారు. మండలంలోని మురారి ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న త్రివేణి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా వెంకటరమణ

కోటనందూరు: మండలంలోని కేఏ మల్లవరం ఎంపీయూపీ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న స్వర్ణ వెంకటరమణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. టీచర్స్ డే సందర్భంగా శుక్రవారం కాకినాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

జగ్గంపేట: స్థానిక ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం వాకచర్ల వరలక్ష్మీకుమారి కాకినాడలో జిల్లా కలక్టర్ షణ్మోహన్, డీఈఓ డి.రమేష్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.



ఏలేశ్వరంలో గురువులను సన్మానిస్తున్న పెన్షనర్ల సంఘ నాయకులు

ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమకు సత్కారం

జగ్గంపేట: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్నారులకు చిత్తశుద్ధితో విద్యాబుద్ధులు నేర్పి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. అనంతరం స్థానిక నేతలు, అంగన్‌వాడీలు సీడీపీఓ పూర్ణిమను పూలమాల, శాలువాతో సత్కరించారు. స్థానిక నేతలు జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, పీలా మహేష్, రాయి సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో ఎంప్లాయీస్ యూనియన్, హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నవోదయ ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. మూడున్నర దశాబ్దాలుగా సేవలందిస్తున్న కొత్తూరు బాబూరావును జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరస సత్యనారాయణ శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.



కిర్లంపూడిలో వీరవెంకట సత్యనారాయణను సత్కరిస్తున్న ముద్రగడ గిరిబాబు

గురువు పాత్ర గొప్పది

తుని: మనిషి జీవితంలో గురువు పాత్ర ఎంతో గొప్పదని మున్సిపల్ చైర్మన్ నార్ల భువనసుందరి అన్నారు. పట్టణంలోని కుట్టుమెషీన్ శిక్షణ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన టీచర్స్ డే వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో గురువుకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఏటా టీచర్స్ డే రోజును దానిని గుర్తు చేసుకోవడం ఆనందదాయకమన్నారు. టైలరింగ్ శిక్షణ ఇస్తున్న గురువులను అభినందించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ కుసుమంచి శోభారాణి, రాపేటి పద్మ, కొనే సుజాత, వేమూరి నాగలక్ష్మి పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని పాఠశాలల్లో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. తొండంగి, పెరుమాళ్లపురం, ఎ.కొత్తపల్లి తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినికి సత్కారం

ప్రత్తిపాడు: మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన పాలూరి స్వప్నను జిల్లా అధికారులు ఘనంగా సత్కరించారు. కాకినాడలో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో స్వప్న జిల్లా కలెక్టర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

ఉత్తమ్మ ఉపాధ్యాయుడిగా విజయ్‌కిరణ్

శంఖవరం: స్థానిక ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు వై.శేషు విజయ్‌కిరణ్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్టు మండల విద్యాశాఖాధికారి ఎస్‌వీ రమణ తెలిపారు. కాకినాడలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకున్నారు. కిరణ్‌కు పలువురు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.



కాకినాడలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న విజయ్‌కుమార్, వెంకటరమణ



జగ్గంపేటలో ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమను సత్కరిస్తున్న నేతలు



తుని టీచర్స్ డే వేడుకల్లో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ భువనసుందరి

వనదుర్గ అమ్మవారికి చండీహోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు వేదుల సూర్యనారాయణ, ప్రయాగ రాంబాబు, చిట్టెం వాసు, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. హోమంలో 30 మంది భక్తులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమ పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి పరిచారకుడు నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ పండితులు కుంకుమపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట: విద్యుత్ లైన్ల మరమ్మతులు, వైర్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో డీఈ బి.వీరభద్రరావు శుక్రవారం తెలిపారు. జగ్గంపేట–నరేంద్రపట్నం ఫీడర్ పరిధిలోని భావవరం, కాండ్రేగుల గ్రామాలతో పాటు వ్యవసాయ బోర్లు, భావవరం వాటర్ ప్లాంట్‌కు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.